సాక్షి చిత్తూరు

సోమవారం । 6 । నవంబర్ । 2023



పవిత్రోత్సవాలు పరిపూర్ణం

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా పరిపూర్ణమయ్యాయి. - 8లో



'పవర్' ఫుల్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ట్రాన్స్‌కో చర్యలు ప్రారంభించింది. - 8లో



ప్రత్యక్ష ఎన్నికలతో అవినీతి అంతం

ప్రధాని, సీఎం పదవులకు ప్రత్యక్ష ఎన్నిక నిర్వహిస్తే, అవినీతిని అంతం చేయవచ్చని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

భక్తజన బోయకొండ



క్యూలో వేచి ఉన్న భక్తులు

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరుగాంచిన శ్రీబోయకొండ గంగమ్మతల్లి దీవెనల కోసం భక్తులు ఆదివారం ఆశేషంగా తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు జరిగాయి. ఉదయం నుంచే ఆలయంలో భక్తులు క్యూ కట్టారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం విచ్చేశారు. సుమారు 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఉంటారని అధికారులు తెలిపారు. బోయకొండలో ఎటు చూసినా భక్తజన సందడి కనిపించింది. కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు సమస్యలను వినతుల రూపంలో అందజేయాలని పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు స్పందనకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

నేడు పోలీసు స్పందన

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని తెలిపారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు

చిత్తూరు కార్పొరేషన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పంచాయతీలను ఈఓపీఆర్డీలు తరుచూ తనిఖీ చేయాలని డీపీఓ లక్ష్మి ఆదేశించారు. ఆదివారం పలు అంశాలపై ఆమె మాట్లాడారు. పల్లెలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర పనులను పరిశీలించాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వీధిదీపాలు పనిచేసే విధంగా చూడాలన్నారు. స్వమిత్వ యోజన సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అవగాహన కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని చెప్పారు. పంచాయతీ అభివృద్ధి సూచికలో ఎస్‌డీజీ లక్ష్యాలు, పేదరికం లేని మెరుగైన జీవనోపాధి గ్రామం ఏర్పాటుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఇంటి పన్నును డిసెంబర్ 31వ తేదిలోగా నూరు శాతం వసూలు చేయాలని చెప్పారు. నివేదికలు ఎప్పటికప్పుడు డివిజనల్ పంచాయతీ అధికారులకు అందించాలని ఆదేశించారు.

ఫిబ్రవరి లోపు లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్‌ను జనవరి నుంచి ఫిబ్రవరి నెలాఖరు లోపు ఇవ్వాలని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కేశవులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్‌ను పంపవచ్చని తెలిపారు. అనారోగ్యంతో మంచానికే పరిమితమైన పెన్షనర్లు నిర్ణీత దరఖాస్తులో ఫొటోలు అతికించి కుటుంబ సభ్యుల ద్వారా సంబంధిత సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు వీడియో కాల్ ద్వారా పెన్షనర్‌ను చూసి దరఖాస్తును ఆమోదిస్తారని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 70,250 మంది స్వామివారిని దర్శించుకోగా, 43,014 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.14 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



● ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి గిరిబాబుది తుమ్మింద పంచాయతీ అడవిచేను గ్రామం. ఇతనికి 20 ఆవులున్నాయి. అందులో పాలిచ్చేవి 12 ఉన్నాయి. ఇవి రోజు 75 లీటర్ల వరకు పాలు ఇస్తున్నాయి. డెయిరీ నిర్వాహకులు ఇంటి వద్దకే వచ్చి ఈ పాలను సేకరిస్తున్నారు. పదిరోజులకోసారి బిల్లులు ఇస్తున్నారు. పాడి పశువుల పోషణకు సొంత పొలంలో పశుగ్రాసం సాగు చేశాడు.



● తొప్పాతిపల్లెకు చెందిన రమాదేవికి 16 పశువులున్నాయి. ఇందులో పాలిచ్చేవి 10 ఉండగా రోజూ 40 లీటర్ల పాలు ఇస్తున్నాయి. తద్వారా నెలకు రూ.80 వేల నుంచి రూ.90 వేల వరకు ఆదాయం వస్తోంది. పశు దాణాకు రూ.20 వేలు పోను మిగిలింది, జీవనోపాధికి ఉపయోగపడుతోంది. ఈమె పాడి పశువులతో పాటు కొద్దిగా వరిసాగు చేసుకుంటోంది.



రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం పలు పథకాలు, రాయితీలు అమలు చేస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇవి క్షేత్రస్థాయిలో వందశాతం అందుతున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకుని ఆ పల్లె పశుపోషణపై దృష్టి సారించడంతో పాల వ్యాపారం జోరందుకుంది. నేడు పాడి పరిశ్రమ వారికి జీవనాడిగా మారింది.

పాడి.. జీవనాడి



- తుమ్మింద సచివాలయ పరిధిలో పాడి పరిశ్రమ వృద్ధి
- 1,210 కుటుంబాలకు పాడితో జీవనోపాధి
- రోజూ 3 వేల లీటర్ల ఉత్పత్తి
- ఆర్థికంగా బలపడుతున్న రైతులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తుమ్మింద సచివాలయ పరిధిలో తుమ్మింద, తొప్పాతి పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 10 గ్రామాలుండగా 1,450 కుటుంబాలున్నాయి. ఈ కుటుంబాలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నాయి. మామిడి, బొప్పాయి, వేరుశనగ, కూరగాయల పంటలు సాగు చేస్తున్నాయి. ఇక్కడ ఏటా వ్యవసాయం చురుగ్గా సాగుతోంది. ఊరు పచ్చని పొలాలతో కళకళలాడుతోంది. అలాగే ప్రతి ఇంటా పాడి పశువులు ఉన్నాయి. కొంత మంది రైతులు ఇంటి ఆవరణలో పశుపోషణకు షెడ్లు నిర్మించుకోగా, మరి కొంతమందిపాడి పశువుల పోషణ కోసం పొలాల్లోనే నివాసం ఉంటున్నారు. వీరి పోషించే పాడి పశువుల్లో ఎక్కువగా జెర్సీ, హెచ్ఎఫ్, నాటు తదితర ఆవులు ఉన్నాయి. వ్యవసాయం, పాడి రెండు కళ్లుగా భావించి ఈ గ్రామంలోని రైతులు నిత్యం బిజీబిజీగా కనిపిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వరకు ఇంటిల్లిపాది పని చేస్తున్నారు.

పశుపోషణే జీవనాధారం

తుమ్మింద సచివాలయ పరిధిలో 1,450 కుటుంబాలుండగా, అందులో 1,210 కుటుంబాలు పశుపోషణపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఈ కుటుంబాల వారు మొత్తం 3,150 పశువులు పోషిస్తున్నారు. ఇందులో 1,460 పాలిచ్చే ఆవులున్నాయి. తద్వారా రోజూ 3 వేల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. ఏడు డెయిరీల నిర్వాహకులు ఈ పాల సేకరణకు గ్రామంలోనే పోటీ పడుతున్నారు. లీటర్ పాలకు నాణ్యత ఆధారంగా రూ.30 నుంచి రూ.43 వరకు ఇక్కడ చెల్లిస్తున్నారు. పాల విక్రయంతో ఒక్కొక్క కుటుంబం ప్రతి నెలా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం పొందుతోంది. ఆ ఆదాయంలో పశుపోషణకుపోను మిగిలిన ఆదాయాన్ని ఇంటి అవసరాలకు వాడుకుంటున్నారు. మరికొందరు ఆ ఆదాయంతో తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు.



పాడి ఆవులు

రైతుకు భరోసా..

నాలుగేళ్ల కిందట తుమ్మింద సచివాలయ పరిధి లో పశుపోషణ అంతంత మాత్రంగానే ఉండేది. కేవలం 752 ఆవులు మాత్రమే ఉన్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. అప్పట్లో వీటి మేతకు రైతులు అష్టకష్టాలు పడేవారు. ఈ పరిస్థితుల్లో పాడి పరిశ్రమ అంతంతమాత్రంగానే ఉండేది. రైతు భరోసా కేంద్రాలు వచ్చాక పాడి పరిశ్రమ వృద్ధి ఘణనీయంగా పెరిగింది. తుమ్మిందలో నాలుగేళ్ల కిందట ప్రభుత్వం ఆర్బీకే ఏర్పాటు చేసి, పశువైద్య సహాయకులను నియమించింది. పశుగ్రాసం పెంపకానికి చేయూత నిస్తోంది. దాణాను తక్కువ ధరకే గ్రామంలోనే అందిస్తోంది. పశువులకు జబ్బు చేస్తే వెంటనే క్షేత్రసిబ్బంది రైతు ఇంటి వద్దకే పరుగు పెడుతున్నారు. ప్రభుత్వం అందించే ఆ పథకాలతో రైతులు పాడి పరిశ్రమపై మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా తుమ్మింద సచివాలయ పరిధిలో పశు పెంపకం వృద్ధి చెందుతోంది. రైతుభరోసా కేంద్రాల సేవలపై రైతులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

కొడుకుని బీటెక్ చదివిస్తున్నా..



మాకు మొత్తం ఆరు ఆవులు..ఐదు దూడలు ఉన్నాయి. గతంలో రోజూ 50 లీటర్ల పాలు పోసేవాళ్లం. ఇప్పుడు ఆవులు చూలుకొచ్చాయి. దీంతో రోజు 20 లీటర్ల పాలు ఇస్తున్నాయి. ప్రస్తుతం నెలకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తోంది. దీంతో నా పెద్ద కొడుకుని బీటెక్ చదివిసున్నా. రెండో కొడుకుని ఇంటర్మీడియట్ చదివిస్తున్నా.

–గంగాధరం, తుమ్మింద, చిత్తూరు మండలం

దాణా బాధ లేదు



రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసిన తరువాత పశు పోషణకు దాణా బాధలు తప్పాయి. కేంద్రంలోనే దాణా ఇస్తున్నారు. పశుగ్రాస విత్తనాలు రాయితీ, కొన్నిసార్లు ఉచితంగా కూడా ఇస్తున్నారు. ఆవులకు వ్యాధులొచ్చినప్పుడు ఫోన్ చేస్తే పశువైద్య సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి వైద్యం చేస్తున్నారు. దీంతో మా ఊర్లో పాడి పరిశ్రమ రోజురోజుకూ వృద్ధి చెందుతోంది.

– నటరాజ్, తుమ్మింద అడవిచేను

80 శాతం మందికి పాడే ఆధారం



తుమ్మింద సచివాలయ పరిధిలో 80 శాతం ప్రజలు పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రోజుకు 3 వేల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. రైతులకు కావాల్సిన దాణాను రైతు భరోసా కేంద్రంలోనే ఇస్తున్నాం. పశుగ్రాస విత్తనాలను కూడా రాయితీతో ఇస్తున్నాం. ఏటా జొన్నలు, మొక్క జొన్నలు ఏటా 5 టన్నులు పంపిణీ చేస్తున్నాం. ఇప్పటివరకు ఏడుగురికి ఛాప్ కట్టర్లు ఇచ్చాం.

– సూరి, పశుసంవర్ధక శాఖ సహాయకులు

తుమ్మిందలో ప్రబలిన అతిసారం

- ఒకరి మృతి,15 మందికి అస్వస్థత
- వైద్యాధికారుల తక్షణ చర్యలు



సూచనలిస్తున్న ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్ఓ రాజశేఖర్‌రెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో అతిసార ప్రబలింది. ఆదివారం ఓ మహిళ మృతి చెందింది. శుక్రవారం రాత్రి ఓ చిన్నారి వాంతులు విరేచనాలతో ఆస్పత్రి పాలైంది. ఇలా మరికొందరు విరేచనాల బారిన పడి చికిత్స చేయించుకుంటున్నారు. ఈ విషయం తెలియడంతో వైద్యాధికారులు స్పందించారు. గ్రామంలో ప్రత్యేక శిబిరం పెట్టించారు. తర్వాత ఓ వృద్ధుడు చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేశాడు. అతడు శనివారం మృతి చెందాడు. ఇతని మృతికి అతిసారం కారణం కాదని, కిడ్నీ సమస్యతో చనిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఆదివారం మల్లిక (55) అనే మహిళ డయేరియాతో చనిపోయింది. ఈమెకు పలు రకాల వ్యాధులు ఉండడం..అందుకు అతిసారం తోడు కావడంతో మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. తాగునీరు కలుషితం కావడంతో అతిసారం వ్యాపించినట్లు గుర్తించారు. పక్క గ్రామం నుంచి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. ఇంటింటా సర్వే చేయడంతో 15 మంది అతిసారం బాధపడుతున్నట్లు తేల్చారు. వీరికి శిబిరం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజశేఖర్‌రెడ్డి గ్రామాన్ని సందర్శించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా

నగరి : ప్రభుత్వ సాయం అంటే అది పెద్దలకు మాత్రమే పేదలకు కాదు అన్న కాలం పోయింది. నిరుపేదలకు వెన్నుదన్నుగా నిలిచే ప్రభుత్వం ప్రస్తుతం నడుస్తోందని మరోమారు నిరూపితమైంది. ఇటీవల వినాయక చవితి వేడుకల్లో విద్యుత్ ప్రమాదానికి లోనై మృతిచెందిన నగరి మున్సిపల్ పరిధి కీళపట్టుకు చెందిన సంజయ్ అలియాస్ డేవిడ్ కుటుంబానికి మంత్రి ఆర్కేరోజా ఆదివారం రూ.5 లక్షల ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఏకైక ఆధారమైన ఇతను లేకపోవడంతో నిరుపేద కుటుంబం దీనావస్థకు వెళ్లిపోవడాన్ని అర్థం చేసుకున్న మంత్రి అండగా నిలిచారు. ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించి, వారి పరిస్థితిని వివరించి రూ. 5 లక్షలు అందేలా చేశారు. ఆదివా రం మృతుని తల్లి మల్లికకు క్యాంప్ కార్యాలయం వద్ద చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు సత్కరించి కృతజ్ఞత చాటుకున్నారు. కౌన్సిలర్ యాకోబ్, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రారెడ్డి, శ్రీనివాసులు, వజ్రవేలు, రవి, యోవాన్, చిన్నబ్బ, జబరాజ్, సుబ్రమణ్యం, ఆరుముగం, అరుల్ తదితరులు పాల్గొన్నారు.



మృతుని తల్లికి చెక్కును అందజేస్తున్న మంత్రి ఆర్కే రోజా

అమర్ వ్యాఖ్యలపై భగ్గుమన్న ముస్లింలు



పలమనేరులో ముస్లిం మైనారిటీల నిరసన



మీడియాతో మాట్లాడుతున్న మైనారిటీ నేతలు

- అసభ్య పదజాలాలతో వైఎస్సార్‌సీపీ నేతపై దూషణలు
- మనోభావాలు దెబ్బతినడంతో ముస్లింల ఆగ్రహం
- వేలాదిమందితో పలమనేరులో భారీ నిరసన ర్యాలీ
- క్షమాపణ చెప్పాలని డిమాండ్

పలమనేరు: వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్, పట్టణంలో మసీదుల మర్కస్ సదర్ ఎస్‌కేఎస్ జాఫర్‌ను హేళనపరిచేలా టీడీపీ మాజీ మంత్రి, పలమనేరు మాజీ ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అసభ్య పదజాలాలతో దూషణ చేయడంపై ముస్లింలు తీవ్రంగా మండిపడ్డారు. తమ మనోభావాలు దెబ్బతిన్నాయని వేలాది మంది ముస్లింలు పట్టణంలో ఆదివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. గతంలో ముస్లింల ఓటు బ్యాంకుతో వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి కోసం టీడీపీకి అమ్ముడుపోయిన వ్యక్తి తమను కించపరచడమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలిలా ఉన్నాయి. శనివారం మున్సిపాలిటీలోని గంటావూరులో మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జాఫర్‌ను వ్యక్తిగతంగా అసభ్య పదజాలాలతో దూషించారు. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై తీవ్రంగా కలత చెందిన ముస్లిం మైనారిటీలు వేల సంఖ్యలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అమర్ డౌన్, డౌన్ అన్న నినాదాలు మిన్నంటాయి. మంత్రి పదవి కోసం పార్టీ మారిన వ్యక్తిత్వం లేని మనిషంటూ ఘాటుగా విమర్శించారు.

వచ్చే ఎన్నికల్లో సత్తా చూపిస్తాం..

మైనారిటీ నాయకులు మాట్లాడుతూ చిన్నచూపుతో ముస్లిం నేతను అవమానకరంగా మాట్లాడిన అమర్‌నాథరెడ్డికి రానున్న ఎన్నికల్లో తమసత్తా ఏమిటో చూపిస్తామని స్పష్టం చేశారు. స్థానిక ఏటీఎం సర్కిల్లో బీడిమస్తాన్ మాట్లాడుతూ 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే అమరనాథ రెడ్డికి ముస్లింలంటే ఎంతో గౌరవముందో ఇప్పుడు అర్థమైందన్నారు. వార్డు కౌన్సిలర్ నూరీ మాట్లాడుతూ మంత్రి పదవి కోసం వైఎస్సార్ సీపీకి ద్రోహం చేసిన అమర్‌కు తగిన బుద్ధి చెబుతామన్నారు. ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి తన వెనుకనుంటే మంచోళ్లు లేదంటే చెడ్డవాళ్లుగా మాట్లాడడం హేయమని మండిపడ్డారు. పార్టీ సీనియర్ నాయకుడు రహీంఖాన్ మాట్లాడుతూ మైనారిటీలకు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. పార్టీ పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా మాట్లాడుతూ వ్యక్తిగతంగా దూషించడం తగదని తెలిపారు.పార్టీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ మాట్లాడుతూ అమర్ సుదీర్ఘ రాజకీయ అనుభవం ఇదేనా అని విమర్శించారు. యూత్ నాయకుడు ముజ్జు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని మసీదులకు పెద్దమనిషి అనే గౌరవం కూడా లేకుండా జాఫర్‌ను దూషించడం గర్హనీయమని మండిపడ్డారు. మైనారిటీ నేత సబీర్ మాట్లాడుతూ మైనారిటీలంటే అమరనాథ రెడ్డికి కసి ఉందేమో.. అందుకే ఇలా తమ కులపెద్దను అవమానం చేశారని.. ఆయనకు వచ్చే ఎన్నికల్లో మైనారిటీల దెబ్బ ఎలా ఉంటుందో తెలుస్తుందని పేర్కొన్నారు. పార్టీ పట్టణ కన్వీనర్ జాఫర్ మాట్లాడుతూ స్వార్థం కోసం పార్టీలు మారే పెద్దమనిషి బాగోతాలన్నీ ప్రజలందరికీ తెలుసని, వచ్చే ఎన్నికల్లో మైనారిటీల పవర్ ఏమిటీ తెలుస్తుందన్నారు.

పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత

మాజీ మంత్రి వ్యాఖ్యలపై ఆదివారం పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది. అమర్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసన ర్యాలీలో వేలాదిమంది ముఖ్యంగా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అమర్ వ్యాఖ్యలపై నియోజకవర్గంలోని మైనారిటీల నేతలు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఏఎంసీ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు జన సంద్రంగా మారింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

పకడ్బందీగా ప్రత్యేక ఓటర్ల నమోదు



గంగవరం: పసుపత్తూరు కేంద్రంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారాలు జిల్లాలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 1,762 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాలను డీఆర్వో, ఆర్డీవోలు, తహసీల్దార్లు పర్యవేక్షించారు. శనివారం ఫారం 6 (కొత్త ఓట్ల నమోదు), ఫారం 7 (చేర్పడం, తొలగించడం), ఫారం 8 (నివాసం మార్పు, నమోదుల సవరణ)లను స్వీకరించారు. పుంగనూరు నియోజకవర్గంలో 283 దరఖాస్తులు, నగరి నియోజకవర్గంలో 170, గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 120, చిత్తూరు నియోజకవర్గంలో 156, పూతలపట్టు నియోజకవర్గంలో 193, పలమనేరు నియోజకవర్గంలో 291, కుప్పం నియోజకవర్గంలో 232 దరఖాస్తులు వచ్చాయి. శనివారం మొత్తంగా 1445 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఆదివారం బీఎల్‌వోలు ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓట్ల నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం డిసెంబర్ 2, 3 తేదీల్లో మళ్లీ అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించనున్నారు.

దుండగులంతా ఒకే డ్రెస్ కోడ్

- బంగారు ఆభరణాల చోరీ కేసు ● సీసీ ఫుటేజీలో గుర్తించిన పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో చోరీకి గురైన రూ.22 లక్షల విలువైన బంగారు ఆభరణాల కేసులో నిందితుల కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. కీర్తన బంగారు ఆభరణాల తాకట్టు రుణాల కంపెనీకి సంబంధించి, 880 గ్రాముల బంగారు ఆభరణాలను ఆ సంస్థ ఉద్యోగి జాన్‌బాబు కారులో వదిలి లాడ్జిలోకి వెళ్లిన సమయంలో చోరీ అయిన విషయం తెలిసిందే. ఇందులో సంస్థ ఉద్యోగి నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా ఉన్నప్పటికీ.. పట్టపగలు నిత్యం జన సంచారం ఉండే రోడ్డుపై కారు అద్దాలు పగులగొట్టి దుండగులు చోరీ చేయడం సంచలనంగా మారింది. ప్రతి నెలా జరిగే క్రైమ్ మీటింగుల్లో రోడ్లపై నిత్యం పోలీసులు కనిపిస్తుండాలని పదే పదే ఎస్పీ చెబుతున్నా కూడా జిల్లా కేంద్రంలోనే పోలీసుల తీరుపై ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు ఓ చోట సీసీ ఫుటేజీలో నిందితులు నలుగురుగా గుర్తించిన పోలీసులు.. అందరూ ఒకే యూనిఫామ్ లాంటి డ్రెస్ కోడ్ వేసుకున్నట్లు తేల్చారు. నిందితులంతా బస్సులో తమిళనాడులోని కాట్పాడికి వెళ్లినట్టు సమాచారం. అక్కడి నుంచి ఎటువైపు వెళ్లారనే విషయంపై వేలూరు పోలీసులతో సమన్వయం చేసుకుని చిత్తూరు పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

భర్త మందలించాడని వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన గంగ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఎస్టేట్‌కు చెందిన వివాహిత తిలగవతి గంగ (20) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. ఎస్టేట్ సమీపంలోని రాజాజీ నగర్ కాలనీకు చెందిన గంగ, హరిప్రసాద్‌కు పెళ్లయ్యి ఓ కొడుకు ఉన్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య చిన్నపాటి మనస్పర్థలు తలెత్తాయి. పెద్దలు కల్పించుకుని సర్దిచెప్పేవారు. శనివారం ఎక్కువ సేపు ఫోన్ చూస్తుండడంతో ఇది మంచిది కాదని భార్యను హరిప్రసాద్ మందలించాడు. దీంతో మనస్తాపం చెందింది. ఆమె రాత్రి భోజనం అనంతరం భర్త, పిల్లాడితో కలిసి నిద్రకు ఉపక్రమించింది. అర్ధరాత్రి హాలులోని ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పవర్ ఫుల్

ఉమ్మడి జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రూ.94.86 కోట్లతో 34 కొత్త సబ్‌స్టేషన్లను నిర్మించనుంది. మార్చిలోపు వీటిని ప్రారంభించాలని ట్రాన్స్‌కో నిర్ణయించింది. విద్యుత్ పరికరాల వాడకంతో పాటు సర్వీసులు భారీగా పెరుగుతున్నాయి. దీంతో పలు ప్రాంతాల్లో ఓవర్ లోడ్‌తో లైన్ ట్రిప్, లైన్‌లాస్‌లు చోటు చేసుకుంటున్నాయి. లో–ఓల్టేజీ సమస్యలు తలెత్తుతుండడంతో వాటి నివారణ కోసం ఉమ్మడి జిల్లాలో సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. మార్చిలోపు అందుబాటులో తీసుకురావాలని యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు.

- మెరుగైన విద్యుత్ సరఫరాకు ముమ్మర చర్యలు
- రూ.94.86 కోట్ల వ్యయంతో కొత్తగా 34 సబ్‌స్టేషన్లు
- వ్యవసాయానికి మరింత నాణ్యంగా..
- బ్రేక్‌డౌన్స్, లైన్ లాస్‌లకు స్వస్తి


సదుంలోని తిమ్మనాయనపల్లెలో సబ్‌స్టేషన్ పనులు


చిత్తూరు అనుపల్లెలో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు రూ.94.86 కోట్లతో 34 కొత్త సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో అన్ని రకాల సబ్‌స్టేషన్లు కలిపి మొత్తం 456 ఉన్నాయి. ఇవి కాకుండా కొత్తగా 33/11 సబ్‌స్టేషన్లు 34 మంజూరయ్యాయి. ఇందులో 10 సబ్‌స్టేషన్ పనులు జరుగుతుండగా, మిగిలిన 24 సబ్‌స్టేషన్లను సాంకేతికంగా ప్రారంభించారు. ఒక్కొక్క సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.79కోట్ల నిధులు ఖర్చు చేయనున్నారు. ఈ లెక్కన 34 సబ్‌స్టేషన్లకు రూ.94.86 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఒక్కో సబ్‌స్టేషన్ను 7వేల హెచ్‌పీ సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్నారు. ఆ లెక్కన మొత్తం 34 సబ్‌స్టేషన్ల పరంగా 2.38 లక్షల హెచ్‌పీ సామర్థ్యంతో అందుబాటులోకి తెనున్నారు. రొంపిచెర్ల, సదుం, సోమల, చౌడేపల్లె, పుంగనూరు, పులిచెర్ల, తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి, చంద్రగిరి, పెనుమూరు ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. మార్చి నాటికి అన్ని సబ్‌స్టేషన్లను ప్రారంభించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చిత్తూరులోని అనుపల్లె, తిరుపతిలోని తొండవాడ, ఏర్పేడులోని చిందేపల్లె జగనన్న కాలనీలో సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నారు. ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం ఆధ్వర్యంలో పనుల పర్యవేక్షణ జరుగుతోంది. గతంలో ఒకేసారి ఇంత పెద్దస్థాయిలో సబ్‌స్టేషన్ల నిర్మాణం ఎప్పుడూ జరగలేదు. ప్రస్తుతం ఆర్‌డీఎస్ఎస్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పల్లెలకు త్రీ ఫ్యూజ్ సరఫరా కోసం రూ.1000 కోట్లతో పనులు జరుగుతున్నాయి.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 19.60 లక్షలు సర్వీసులు ఉండగా, అందులో వ్యవసాయ సర్వీసులు 3.20 లక్షలకు పైగా ఉన్నాయి. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు మరో ముందడుగు పడింది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లో–ఓల్టేజీ సమస్య తలెత్తకుండా మెరుగైన నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నారు. జిల్లాలో బోర్లపై ఆధారపడి పంటలు పండించేవారు అధికంగా ఉన్నారు. లైన్‌కు చివర ఉన్న రైతు వరకు ఎలాంటి సమస్యా లేకుండా కరెంటు సరఫరా చేయాలన్న ఉద్దేశంతో సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. వీటిని కనీసం మరో ఆరునెలల్లో పూర్తి చేయాలన్నది అధికారుల లక్ష్యం.

కొత్త సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తే

- విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఉండవు
- తరుచూ బ్రేక్ డౌన్ వంటి ఇబ్బందులను అధిగమించవచ్చు
- వ్యవసాయానికి లో ఓల్టేజీ లేకుండా మెరుగైన కరెంటు ఇవ్వొచ్చు
- సబ్‌స్టేషన్లు ఎక్కువగా ఉండడం వల్ల విద్యుత్ నష్టాలను అరికట్టవచ్చు
- ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు వంటివి కాలిపోవడానికి వీలుండదు.

మార్చి లోపు ప్రారంభిస్తాం



"చిత్తూరు ఉమ్మడి జిల్లాలో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ల పనులు పూర్తయితే మెరుగైన విద్యుత్ సరఫరాను వినియోగదారులకు అందించవచ్చు. మార్చిలోపు వీటిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నిర్మాణ విభాగం ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. వీటి ద్వారా మెరుగైన సరఫరాను అన్ని రంగాలకు అందిస్తాం. వ్యవసాయ సర్వీసులు, లోడ్ అధికంగా ఉండే ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాం. – కృష్ణారెడ్డి, ఎస్ఈ ట్రాన్స్‌కో

పవిత్రోత్సవాలు పరిపూర్ణం


కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆలయ అర్చక, వేదపండితులు


పూర్ణాహుతి సమర్పణ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి ఆలయంలో నాలుగు రోజుల పవిత్రోత్సవాలు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా పరిపూర్ణమయ్యాయి. ఉదయం పవిత్రోత్సవాలకు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, దాత రమణ దంపతులు పూజా సామాగ్రిని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం అలంకార మండపంలో ఏర్పాటు చేసిన కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆరవ కాల పూజ అవభృథోత్సవం, మహా పవిత్ర సమర్పణ, ద్రవ్యాహుతి, మహా పూర్ణాహుతి సమర్పించి కలశోద్వాసన చేశారు. కలశాలను ఊరేగించారు. అనంతరం మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం సెలవురోజు కావడంతో ఆలయంలో రద్దీ సాగింది, ట్రస్ట్ బోర్డు సభ్యులు జయశ్రీ, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు చారిత్రాత్మకం


సీఎం జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న పాత్రికేయులు

పుంగనూరు: జర్నలిస్టుల జీవితాల్లో వెలుగులు నింపేలా ఇళ్ల స్థలాల పంపిణీకి మంత్రి మండలి ఆమోదం తెలపడంపై కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం పాత్రికేయులు పాలాభిషేకం చేశారు. ప్రెస్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు పీఎస్.ప్రకాష్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంబీటి రోడ్డులో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రకాష్ మాట్లాడుతూ నిత్యం సమాజసేవలో ఉండే జర్నలిస్టుల సేవలను గుర్తించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్మాత్మకమని తెలిపారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని స్పష్టం చేశారు. పాత్రికేయులు వసంతకుమార్, సురేష్, వాలీశ్వర్‌రెడ్డి, జగన్, సలీం, అప్పిరెడ్డి, జీఆర్.మురళి, సతీష్, సైపుల్లా, డిష్ సతీష్‌కుమార్, రాజేష్, దీపక్, కోటరెడ్డి ప్రసాద్, మర్రిబాబు, అప్పా, జావీద్, కుమార్, చిన్న స్వామి, భానుమహర్షి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ సాధనతో మేధో సంపత్తి


అబాకస్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులతో ముఖ్య అతిథులు

తిరుపతి ఎడ్యుకేషన్ : అబాకస్ సాధనతో పిల్లల్లో మేధో సంపత్తి పెరుగుతుందని ఏఎస్పీ బీహెచ్.విమలకుమారి తెలిపారు. ధరణి అబాకస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అబాకస్‌పై జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన వివిధ రాష్ట్రాలకు చెందిన 390 మంది విద్యార్థులకు ఆదివారం తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ట్రోఫీలు, పతకాలు, సర్టిఫికెట్లను అందించారు. దీనికి ఏఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ధరణి అబాకస్ డైరెక్టర్ ఎం.రవికుమార్, గూడూరు ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్, చంద్రగిరి డీఎస్పీ టిడి.యశ్వంత్, జాతీయ సంస్కృత వర్సిటీ ప్రొఫెసర్ ఎ.సచ్చిదానందమూర్తి, ప్రభుత్వ వైద్యశాఖ లీగల్ అడ్వైజర్ ఎండి.తయూబ్, వివిధ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప యాత్రకు ఆరేళ్లు

తిరుపతి మంగళం: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర సోమవారానికి ఆరేళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యంలో తిరుపతి తుడా సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, భారీ కేక్ కట్ చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ పాల్గొంటారని తెలిపారు. అదే విధంగా కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ సంస్థల చైర్మన్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆంగ్లంలో బ్రహ్మానందం జీవిత చరిత్ర


ప్రణయ్‌ని అభినందిస్తున్న బ్రహ్మానందం

పుత్తూరు రూరల్: ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందం జీవిత చరిత్రను పుత్తూరు పట్టణానికి చెందిన ప్రణయ్ ఆంగ్లంలో రచించాడు. ఈ విషయాన్ని ఇటీవల నిర్వహించిన కీడా కోలా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో బ్రహ్మానందమే స్వయంగా తెలియజేశారు. తన జీవిత చరిత్రను ఆంగ్లంలో చక్కగా రాసిన ప్రణయ్‌ని అదే వేదికపై బ్రహ్మానందం అభినందించారు. కాగా ప్రణయ్ కీడా కోలా కథకు పని చేశారు.

ప్రత్యక్ష ఎన్నికలతో అవినీతి అంతం


బ్యాడ్మింటన్ క్రీడాకారుడు శ్రీకాంత్, సినీ నటుడు రాజేంద్రప్రసాద్

తిరుమల: దేశం బాగుండాలంటే ప్రధాని, ముఖ్యమంత్రి పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని, అప్పుడే 80 శాతం అవినీతిని అంతం చేయవచ్చని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ఆదివారం ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో ఆయనకు వేద పండితులు ఆశీర్వాదం అందించగా ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ, దేశం బాగుపడాలంటే ప్రధానికి, సీఎంకి నేరుగా ఎలక్షన్ పెట్టాలని, 8 నెలల్లో పార్టీ పెట్టి సీఎం అయిన ఎన్టీఆర్‌ను చూసి గెలిచిన ఎమ్మెల్యేలను చంద్రబాబు ఎలా కొన్నాడో అందరికీ తెలుసన్నారు. నేరుగా ఎన్నికలు పెడితే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో పోటీపడే ఎవరికీ కనీసం డిపాజిట్లు కూడా దక్కవన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి గాలితో గెలిచిన 23 మంది ఎమ్మెల్యేలు చంద్రబాబుకు అమ్ముడు పోయారన్నారు. చంద్రబాబుకి అమ్ముడు పోయిన దరిద్రులకు ఓటు వేశామనే బాధ ప్రజల్లో ఉందని చెప్పారు. డైరెక్ట్ ఎన్నికల ద్వారా అమ్ముడు పోయే రాజకీయాలకు స్వస్తి పలకాలని కోరారు. చంద్రబాబు నీతిమంతుడు అంటే ఎవరూ నమ్మరని, ఆయన హయాంలో ఒక ఎస్సీ, ఎస్టీ గానీ గెలవలేదని గుర్తుచేశారు. ఆయనకంటే ముందు ఎమ్మెల్యే పెద్దారెడ్డి, భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు శ్రీకాంత్, సినీ నటుడు రాజేంద్రప్రసాద్ శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు

చోరీ కేసులో ఐదుగురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపిస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి


పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

- 15 వాహనాలు, 360 బంగారు, వెండి వస్తువుల స్వాధీనం
- జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైం: దొంగతనాలకు పాల్పడుతు న్న ఐదుగురు నిందితులను చంద్రగిరి పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ పరమే శ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రగిరి సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల తరచూ దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి 362 గ్రాముల బంగారు, 100 గ్రాముల వెండి వస్తువులతోపాటు, రూ.1.9లక్షల నగదు 15 ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, బోరు మోటార్, ఐరన్ కట్టర్, గ్రైండర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీటి విలువ సుమా రు రూ.40 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఈ ఐదుగురు 28 కేసుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. ఇటీవల కాలంలో దొంగతనాలు తగ్గుముఖం పట్టాయని చెప్పారు. ఈ సమావేశంలో క్రైమ్ ఏఎస్పీ విమల్ కుమారి, చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్, సీఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి నిషేధిత రసాయనాలతో తయారు చేసిన బాణాసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో అక్రమంగా టపాసులు తయారీ, సరఫరా, విక్రయాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. లైసెన్స్ కలిగిన వారు మాత్రమే ప్రభుత్వ నిబంధనలకు లోబడి బాణసంచా తయారీ, విక్రయాలు చేయాలన్నారు. దుకాణాల వద్ద నీరు, ఇసుక అగ్నిమాపక సామగ్రి తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గ్రీన్ క్రాకర్స్ ముసుగులో నిషేధిత రసాయన వస్తువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.